క్లుప్తంగా

నేడు విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కళా వేదికపై గురువారం వివిధ రంగాల్లోని విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాల్ని ప్రదానం చేయనున్నట్లు కళాదర్బార్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ముందుగా అంతర్జాతీయ కళాకారిణి స్వాతి సోమనాథ్ ఆధ్వర్యంలో కిన్నెరసాని నృత్య ప్రదర్శన ఉంటుందని చెప్పారు. అనంతరం ప్రముఖులకు పురస్కారాలు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కళాభిమానులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో..

అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఉగాది పురస్కరించుకుని గురువారం పలువురు వైద్యులు, ప్రభుత్వ అధికారులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సినీ సంగీత విభావరి, అనంతరం ప్రముఖులకు పురస్కారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాభిమానులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

శాలివాహనులకు అండగా ప్రభుత్వం

పెదనందిపాడు: శాలివాహనులకు (కుమ్మర్లు) ప్రభుత్వం అన్ని విధాలుగా అండంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ చీమకుర్తి లోకేష్ తెలిపారు. పెదనందిపాడులో బుధవారం జరిగిన శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాలివాహనుల చేతివృత్తిని బలోపేతం చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, జగనన్న చేదోడు పథకం వారికి వర్తిస్తుందని చెప్పారు. శాలివాహన చక్రవర్తి గొప్పతనం గురించి ప్రజలకు వివరించారు. అనంతరం శాలివాహన చక్రవర్తి జయంతి కేకును కట్ చేశారు. కార్యక్రమంలో శాలివాహన సంఘ మండల అధ్యక్షుడు చల్లగిరి శ్రీనివాసరావు, సభ్యులు కానుగల నాగభూషణం, పకీరరావు, సాయిబాబు, సామ్రాజ్యం పాల్గొన్నారు.

గోరంట్ల శ్రీవేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



గుంటూరు రూరల్: తెలుగు ప్రజలంతా ఈ ఏడాది శ్రీ వేంకటేశ్వరస్వామి కృపాకటాక్షాలు, సుఖసంతోషాలతో జీవించాలని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ఆకాంక్షించారు. గోరంట్ల శ్రీ వేంకటేశ్వరాలయంలో బుధవారం ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మచరణ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్, ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత మాణిక్యవేల్, స్థానిక కార్పోరేటర్ యర్రంశెట్టి పద్మ, యర్రంశెట్టి సూరి, గుడి సతీష్‌కుమార్, గాజుల సాయిరాం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ



తెనాలి: ఉగాది పర్వదినాన పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్యాత్మిక వేడుకకు వేదికైంది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటైన ఉగాది వేడుకల్లో భాగంగా తొలుత ములుకుట్ల విశ్వనాథశర్మచే పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం 'సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ మహోత్సవం' సాగింది. వేదికపై హనుమత్ సమేత సీతారామలక్ష్మణ విగ్రహాలకు పూజించి కార్యక్రమాన్ని ఆరంభించారు. శ్రీహనుమాన్ సేవాసమితి, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తనా బృందం వేదికపై హనుమాన్ చాలీసా పారాయణ చేయగా, ప్రాంగణంలోని 1108 మంది భక్తులు గళం కలిపారు. వీరిలో అత్యధికులు మహిళా భక్తులే ఉన్నారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేకంగా హాజరయ్యారు. తులసీదాస్ స్వరపరిచిన నలభై శ్లోకాలే హనుమాన్ చాలీసాగా ఆయన చెప్పారు. ఇవన్నీ ద్విపదలో ఉంటాయన్నారు. హనుమాన్ చాలీసా పారాయణాన్ని ఎంతోకాలంగా ఒక యజ్ఞంగా నిర్వహిస్తూ సమాజంలో ఆధ్యాత్మిక భక్తిభావనలు వెల్లివిరిసేలా కృషిచేస్తున్న శ్రీహనుమాన్ సేవాసమితిని ఎమ్మెల్యే శివకుమార్ అభినందించారు. జ్యోతిని వెలిగించిన శ్రీహనుమాన్ సేవాసమితి నిర్వాహకులు వుప్పల వరదరాజులు మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పారాయణంతో అనేక ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. దుష్టశక్తులను దూరం చేస్తాయనీ, శనిగ్రహ ప్రభావం తగ్గుతుందనీ, సవాళ్లను దీటుగా ఎదుర్కొనే శక్తినీ, ధైర్యాన్నీ కలిగిస్తుందని చెప్పారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

శ్రీ శోభకృత్ ఉగాది వేడుకల వైభవం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం

పాత గుంటూరు: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టేలా నగరంలోని ఆలయాలలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విశిష్ట సేవలందించిన ప్రముఖులకు, కళాకారులకు పురస్కారాలు అందించి సత్కరించారు.

- బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజాము ఐదు గంటల నుంచే విశేష అలంకరణలో స్వామి దర్శనం ప్రారంభమైంది. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకొని ఉగాది పచ్చడితో పాటు విశేష ప్రసాదాల్ని స్వీకరించారు.
- అరండల్‌పేట శ్రీ అష్టలక్ష్మీ మందిరంలో ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ చక్ర మేరుకు పంచామృతాభిషేకాలు, వేద పారాయణం, వేద మంత్రాల నడుమ విశేషంగా నిర్వహించారు. అనంతరం అష్ట కళలకు నిలయమైన అమ్మవార్లకు విశేషంగా అనేక రకాల పుష్పాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, నక్షత్ర హారతి, వేద పండితుల ఆశీర్వాదం, ఉగాది పచ్చడితో పాటు తీర్థ ప్రసాద వితరణ జరిగింది.
- ఆర్. అగ్రహారం శ్రీ రామనామ క్షేత్రంలో రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో ఉదయం విశేష పూజలు నిర్వహించి భక్తులకు ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించారు.
- పాత గుంటూరులోని శ్రీ అంకమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- లాలాపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి అభిషేకం, విశేష పూజలు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి. శ్రీనివాసరావు, చైర్మన్ పిచ్చల జయప్రకాష్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకటజ్యోతి, నరేష్‌కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి పాల్గొన్నారు.



బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



పాత గుంటూరు అగస్త్యేశ్వర ఆలయంలో స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



పంచాంగ పఠనం చేస్తున్న నోరి నారాయణమూర్తి



లాలాపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు తీర్థం అందిస్తున్న అర్చకులు



అరండల్‌పేట అష్టలక్ష్మీ ఆలయంలో హారతి ఇస్తున్న అర్చకులు

శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానంలో పూజలు

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీ గంగా భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామివారి దేవస్థానంలో బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకస్వామి చంద్రశేఖర శర్మ స్వామిని విశేషంగా అలంకరించారు. గంగా భ్రమరాంబికా అమ్మవారికి విశేష అభిషేకాల్ని నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, పండ్లతో పూజించారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లతో పాటు దేవస్థానంలో కొలువైన శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య, శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామికి, గణపతి, దత్తాత్రేయ, కాలభైరవ, అభయాంజనేయ, శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామికి పూజలు చేశారు.

అగస్త్యేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

పట్నంబజారు: పాత గుంటూరులోని శ్రీ గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుండే భక్తులు అధిక సంఖ్యలో స్వామికి విశేష పూజలు జరిపారు. పరమేశ్వరునికి రుద్రాభిషేకం, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు జరిపి అలంకరించారు. ఆలయ అర్చకులు లక్ష్మీనారాయణశర్మ, సంగమేశ్వరశర్మ పూజల్ని నిర్వహించారు. సాయంత్రం పంచాగ శ్రవణాన్ని ఏర్పాటు చేశారు.



బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అలంకరణలో స్వామి



విశేష అలంకారంలో దర్శనమిస్తున్న శ్రీమల్లికార్జునస్వామి

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: వేసవిలో నగర ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. అనేక సంవత్సరాల నుంచి సొంత నిధులతో నగరంలోని ముఖ్య కూడళ్లలో తాగునీటి కేంద్రాల్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఏర్పాటు చేసిన తాగునీటి చలివేంద్రాలను (వాటర్ ఫ్రిజ్) వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వేసవిలో నగరంలోని ముఖ్య కూడళ్లలో ఫ్రిజ్‌లను ఏర్పాటు చేసి తాగునీటిని 14 సంవత్సరాల నుంచి అందిస్తున్నట్లు చెప్పారు. వేసవిలో ప్రజలు, పేదలు ఇబ్బందులు పడకుండా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నేత నూరి ఫాతిమా, అంజుమన్ సంస్థల కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ కర్నుమా, మిర్చి యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు మర్రి అంజలి, మెహమూద్, పోలవరపు జ్యోతి, షేక్ మీరావలి, ఆబీద్ బాషా, సంకూరి శ్రీను, వేముల జ్యోతి, ఖాజామొహీద్దీన్‌చిష్టి, దూపాటి వంశీ, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాగునీటి ఫ్రిజ్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా కొత్తపేటలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మొగిలి సతీష్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పి. శ్రీనివాసరెడ్డి, ప్రమీల, విజయలక్ష్మి, ఈర్ల వాణి, కనకదుర్గ, చెంచయ్య, వైఎస్సార్ సీపీ నేతలు పసుపులేటి రామయ్య, దుర్గాప్రసాద్, శ్రీధర్, గొలుసు చంద్రం, పూనూరి నాగేశ్వరరావు, అగ్గిపెట్టె రాజు పాల్గొన్నారు.

నృసింహుని సేవలో రాష్ట్ర మంత్రి ఆలూరి జయరాం



నృసింహస్వామి ఆలయంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ మంత్రి ఆలూరి జయరాం

మంగళగిరి: నగరంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ మంత్రి ఆలూరి జయరాం దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎగువ దిగువ సన్నిధులలో స్వామి వారిని దర్శించుకున్న మంత్రి జయరాం మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా వుండగా ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న రోజులలో సమృద్ధిగా వర్షాలు పడి రైతులతో పాటు రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తెనాలి రూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్ లింగారావు సెంటరులోని లింగారావు ఇంట్లో నివసముండే నన్నపనేని హేమలత దంపతులు కొద్ది రోజుల కిందట తెలంగాణలో ఉంటున్న వారి కుమారుడి వద్దకు వెళ్లారు. మంగళవారం తిరిగి రాగా ఆ తాళం పగులగొట్టి ఉంది. పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలసులు ఇంటిని పరిశీలించారు. రూ. 12 లక్షల విలువైన బంగారం, రూ. 40 వేలు నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి కల్యాణం



గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, స్వామి కల్యాణం, పంచాంగ శ్రవణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు స్వామికి ముత్యాల అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్త బృందం లలితా పారాయణం చేసింది. సాయంత్రం కోలాటం, భజన కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. అనంతరం వేదపండితులు, పురోహితుల సమక్షంలో స్వామి కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అర్చకులు స్వామి తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు, ప్రధాన కార్యదర్శి మేడా సాంబశివరావు, ఆలయ కమిటీ సభ్యులు, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు విశిష్టం

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు విశిష్టమైనవని ప్రభుత్వ పాఠ్య పుస్తక డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంపాలెంలో భారత్ స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన శ్రీశోభకృత్ నామ ఉగాది వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్ని సామాజిక సేవా కార్యక్రమాల దిశగా ప్రోత్సహిస్తున్న భారత్ స్కౌట్స్, గైడ్స్ మన సంస్కృతి, సంప్రదాయాలను మరవకుండా మంచి కార్యక్రమాల్ని నిర్వహిస్తోందని అభినందించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డిని ఉగాది పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ఉప్పాల రామ్మోహనరావు, బీఎస్‌జీ జిల్లా కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఈ.అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు టి.అంకమ్మరావు, సుబ్బారావు, మాలకొండయ్య, ఏపీసీటీసీ జిల్లా అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.



రవీంద్రనాథ్‌రెడ్డిని ఉగాది పురస్కారంతో సత్కరిస్తున్న భారత్ స్కౌట్స్, గైడ్స్ ప్రతినిధులు

ఫిజియోథెరపీతో నొప్పులు మాయం

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలితో అనేక మంది నేడు పలు రకాల నొప్పులతో బాధపడుతున్నారని, ఆపరేషన్లతో పని లేకుండా వాటిని ఫిజియోథెరపీతో నయం చేయవచ్చని ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, స్పోర్ట్స్ ఇంజూరీస్ స్పెషలిస్ట్ డాక్టర్ మామిళ్లపల్లి శివకుమార్ తెలిపారు. స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్, పలకలూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన షైనీస్ ఫిజియోథెరపీ క్లినిక్‌ను బుధవారం డాక్టర్ శివకుమార్, న్యూరాలజిస్టు డాక్టర్ హిమబిందు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలతో బాధపడుతున్న చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో క్లినిక్ నిర్వాహకురాలు బుర్రి అరుణ, రెవరెండ్ కె.కిరణ్‌కుమార్, డాక్టర్ హృదయ రంజన్ పాల్గొన్నారు.



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శివకుమార్, డాక్టర్ హిమబిందు

ప్రముఖులకు ఉగాది పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: అరండల్‌పేటలో బుధవారం ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా విశేష సేవలందించిన ప్రముఖులకు ఉగాది పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ముందుగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నోరి నారాయణ మూర్తి పంచాంగ పఠనం చేశారు. అనంతరం సభకు అవోపా అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావుకు జీవిత సాఫల్య పురస్కారం, ప్రముఖ రచయిత చిట్టిప్రోలు వెంకటరత్నానికి కవిరత్న పురస్కారం, మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ మట్టుపల్లి సత్యనాగమోహన్‌కు ఉగాది పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు టి.రాంబాబు, కార్యదర్శి వి.రాధాకృష్ణయ్య, కోశాధికారి ఎం.శ్రీనివాసరావు, బి.ఎల్.ఆదినారాయణ, డాక్టర్ పి.రాధాబాయి, కె.వి.ఎస్.సుధాకర్ పాల్గొన్నారు.



చిట్టిప్రోలు వెంకటరత్నం దంపతులను సత్కరిస్తున్న ఆవోపా సభ్యులు

మెరుగైన విద్య, వైద్యం జగనన్న లక్ష్యం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- జొన్నలగడ్డలో విలేజ్ క్లినిక్ ప్రారంభం, వైఎస్సార్ విగ్రహావిష్కరణ

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల్ని ప్రజల ఇంటి దగ్గరకే అందజేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మండలంలోని జొన్నలగడ్డలో బుధవారం నూతనంగా నిర్మించిన వైఎస్సార్ గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణను వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ మోదుగుల వేణుగోపాలరెడ్డితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా గ్రామస్తులకు శోభకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జగనన్న డాక్టర్ వైఎస్సార్ గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని ప్రారంభించారని తెలిపారు. జొన్నలగడ్డలో ఎంపీపీ పులగం దివ్య భర్త శ్రీనివాసరెడ్డి రూ. 25 లక్షలు విలువ చేసే స్థలాన్ని ప్రభుత్వానికి ఇవ్వడంతో పాటు అందులో తల్లిదండ్రుల పేరిట విలేజ్ క్లినిక్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో జగనన్న విప్లవాత్మక మార్పుల్ని తెచ్చారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ త్వరలో గ్రామంలో చెరువుకు వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించాల్సిన రైతు భరోసా కేంద్రానికి స్థలాన్ని దానంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వంగా నవీన్‌రెడ్డిని అభినందించారు.సమష్టిగా కృషి చేస్తే గ్రామాభివృద్ధి సులువుగా జరుగుతుందని సూచించారు. దేశంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరం అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పులగం దివ్య, పులగం శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, వైఎస్ ఎంపీపీలు దర్శి సుజాత, ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి పాల్గొన్నారు.



వైఎస్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు

విలీన గ్రామాల అభివృద్ధికి కృషి

గుంటూరు రూరల్: విలీన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. 41వ డివిజన్ అడవితక్కెళ్లపాడు శ్రీనివాసకాలనీలో బుధవారం రూ 1.11 కోట్లతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆమె భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు నగరంలో శివారు గ్రామాలు విలీనమైన తరువాత 15 ఏళ్లపాటు ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కాలనీల రూపురేఖలు మారిపోయాయని, కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి వసతులు, విద్యుత్ వంటి సకల సౌకర్యాల్ని కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జగనన్నకు మనమంతా అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మితపద్మజ, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరీ, ఎల్లయ్య, వెంకట్, అరుణ్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుచరిత తదితరులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చేబ్రోలు: వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం సైకిల్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో బుధవారం జరిగింది. మండల కేంద్రమైన చేబ్రోలుకు చెందిన వృద్ధుడు మురికిపూడి ప్రసాద్ సైకిల్‌పై నారాకోడూరు నుంచి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ సమయంలో నారాకోడూరు తెనాలి రోడ్డులోని మలుపు వద్ద స్కూటీపై వేగంగా వస్తున్న యువకులు ఢీ కొట్టారు. ఈ సంఘటనలో వృద్ధుడు ప్రసాద్ తలకు, ముఖానికి గాయాలయ్యాయి. స్కూటీపై ఉన్న గుంటూరుకు చెందిన ఇద్దరు యువకులు సాయికృష్ణ, రాఘవ కూడా గాయపడ్డారు. స్కూటీ ముందు భాగం దెబ్బతింది. ముగ్గురిని 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

గుంటూరు రూరల్: మల్లవరం పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 23 వేలతో పాటు ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.